## పూర్ణ చందర్ నాయక్‌కు సన్మానం



బాదవత్ పూర్ణచందర్ నాయక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కవిత

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 5 : హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో జరిగిన మహాకవి దాశరథి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బాదవత్ పూర్ణ చందర్ నాయక్ నిర్మించిన ఆ చల్లని సముద్ర గర్భం దృశ్య గీతం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాగృతి యూట్యూబ్ చానల్‌లో విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దాశరథి నా తెలంగాణ కోటి రతనాల వీణ అని నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అనేక రచనలు చేశారని అన్నారు. ఆవేశానికి అక్షరాన్ని తొడగిన కవి దాశరథి కృష్ణమాచార్య అని తెలుగు పండితులని పేర్కొన్నారు. అనంతరం ఆ చల్లని సముద్ర గర్భం దృశ్య గీతం అద్భుతంగా ఉందని కొనియాడారు. పూర్ణ చందర్ మంరింత ఉన్నత స్థాయికి ఎదగాలని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గాయకులు శివన్న, సురేందర్, నవీన్, ఆచారి మల్లిక్, బీఆర్ఎస్ నాయకులు, జాగృతి నిర్వాహకులు, అభిమానులు పాల్గొన్నారు.

## నీటి కుంటలో స్నానానికి వెళ్లి ఇద్దరు బాలురు మృతి

ఎదులాపురం, ఏప్రిల్ 5: ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలో జాతీయ రహదారికి అనుకుని ఉన్న నీటి కుంటలో 170 కాలనీకి చెందిన కామ్డే రాహుల్ (10), చిప్పకుర్తి సంజీవ్(11), విశాల్ కలిసి నీటి కుంటలో స్నానానికి వెళ్లారు. కామ్డే రాహుల్, చిప్పకుర్తి సంజీవ్ స్నానానికి కుంటలో దిగారు. విశాల్ కుంట వద్ద ఉన్నాడు. కాగా నీటి కుంటలో మునుగుతున్న రాహుల్, సంజీవ్‌ను కాపాడడానికి విశాల్ కేకలు వేశాడు. చుట్టుపక్కల ఎవరు లేకపోయేసరికి సహాయం చేయడానికి ఎవరూ రాలేదు. విశాల్ వెంటనే తల్లితండ్రులకు సమాచారం ఇచ్చేందుకు కాలనీకి వెళ్లాడు. అప్పటిలోగా ఇద్దరు బాలురు నీటి కుంటలో గల్లంతైపోయారు. సమాచారం తెలుసుకున్న మావల ఎస్ఐ విష్ణు వర్ధన్ ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాలని పిలిపించి మృతదేహాలను వెలికి తీయించారు. తల్లితండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. చనిపోయిన బాలురు మావలలో ప్రభుత్వ పాఠశాలలో రాహుల్ నాలుగో తరగతి, సంజీవ్ ఐదో తరగతి చదువుతున్నారు.

# కేసీఆర్ సభను విజయవంతం చేద్దాం

- మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న



మాట్లాడుతున్న మాజీమంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఎదులాపురం, ఏప్రిల్ 5 : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను అట్టహాసంగా నిర్వహించనున్నట్లు మాజీమంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న తెలిపారు. సభ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై శనివారం ఆదిలాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్, జైనథ్, బేల,రూరల్ మండలాల నాయకులు, నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచే స్థాయిలో ఉంటుందని, అందుకు పార్టీ కార్యకర్తలంతా కలిసికట్టుగా పని చేసేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, సావాపురే విజయ్, మారిశెట్టి గోవర్ధన్, ఊశన్న, ప్రభాకర్, భోజన్న, నల్ల మహేందర్, వేణుయాదవ్, బట్టు సతీశ్, దేవన్న, గంద్రత్ రమేశ్, రాజు, దేవీదాస్, గంగారెడ్డి పాల్గొన్నారు.

### హనుమాన్ జెండా ఆవిష్కరణ

శ్రీ రామనవమి వేడుకలు పురస్కరించుకుని ఆదిలాబాద్‌లోని శాంతినగర్‌లోని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కరపత్రాలను మాజీమంత్రి జోగు రామన్న విడుదల చేశారు. మొదట హనుమాన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలకు శ్రీ రామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

# రజతోత్సవ సభకు సిద్ధం కావాలి



బీఆర్ఎస్ జెండా గద్దె నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

ఖానాపూర్, ఏప్రిల్ 5: ఈ నెల 27న వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరుగనున్న బహిరంగ సభకు వెళ్లేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఖానాపూర్ నాయకులు పిలుపునిచ్చారు.శనివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని శాంతినగర్ జంక్షన్ వద్ద బీఆర్ఎస్ పార్టీ జెండా గద్దె నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో జెండా గద్దెలు నిర్మించనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రజతోత్సవ బహిరంగ సభకు వెళ్లే ముందు జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధమవుతున్నట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న తీరును ఎండగట్టడానికి బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఖానాపూర్ పట్టణ అధ్యక్షుడు గౌరికర్ రాజు, నాయకులు బీసీ రాజన్న, ప్రదీప్, సుమిత్, లింగన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయి



నేరడిగొండ: వడూర్ ప్రీమియర్‌లీగ్‌ను ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, ఏప్రిల్ 5 : క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామంలో నిర్వహించిన వడూర్ ప్రీమియర్ లీగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. మారుమూల గ్రామాల్లో పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులకు కొంతమంది దాతలు జెర్సీలు అందించగా వారిని ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ జడ్పీటీసీ సయ్యద్ జహీర్, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పండరి, ఉప్పు పోశెట్టి, నాయకులు రాథోడ్ సురేందర్, భూషణ్, గాదె శంకర్, రవీందర్, ఫయాజ్, శ్రీకాంత్, వెంకటరమణ, పాల శంకర్, నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం

వడూర్ గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ప్రారంభించారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన నాయకుడు శ్రీకాంత్‌ను అభినందించారు.

### క్రీడల్లో గెలుపోటములు సహజం

ఇచ్చోడ, ఏప్రిల్ 5: క్రీడల్లో గెలుపోటములు సహజమని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. ఇచ్చోడలో మార్చి 16వ తేదీ నుంచి జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరుకాగా యువకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం టౌర్నమెంట్‌లో గెలిచిన జట్టుకు మొదటి బహుమతి, జట్టుకు రెండవ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సునీత, మాజీ ఉపసర్పంచ్ శిరీష్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు పాండురంగ్, మాజీ ఎంపీటీసీ సుభాష్, సాబీర్, మహేందర్ రెడ్డి, సుభాష్, రమేశ్, రబ్బన్, తానజీ, మహేశ్, ప్రవీణ్, అలీం, ప్రతాప్, మేనేజ్‌మెంట్ సభ్యులు ముసేబ్, ఆదిత్య, ప్రణీత్, అవినాశ్, బబ్లు, చిట్టి పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

దస్తురాబాద్, ఏప్రిల్ 5 : శాంతి భద్రత పరిరక్షణకు కృషి చేయాలని ఎస్ఐ సాయి కుమార్ అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సాయికుమార్‌ను మండల పెరిక సంఘం నాయకులు శనివారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భూమన్న, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ఆ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

### ఇసుక తరలించే ట్రాక్టర్లు సీజ్

జైనథ్, ఏప్రిల్ 5: పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి కోర్టులో డిపాజిట్ చేసి, వారిపైన దొంగతనం కేసులు నమోదు చేస్తున్నామని జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ పోలీస్ స్టేషన్‌లో పెన్‌గంగ పక్కన గ్రామాలైన సాంగ్వి, ఆనంద్‌పూర్, పెండల్‌వాడ, కామాయి, అకోలి గ్రామ పెద్దలతో సీఐ సాయినాథ్, ఎస్ఐ పురుషోత్తం సమావేశం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కమిటీలు ఇసుక వేలం వేసి డబ్బులు డిమాండ్ చేసినట్లయితే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

### సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

బేల, ఏప్రిల్ 5: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని అవల్‌పూర్ గ్రామంలో పోలీసులు మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు సైబర్ క్రైమ్, రోడ్డు భద్రత, 100 డయల్, షీ టీం, మట్కా బెట్టింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ దివ్యభారతి, ఏఎస్ఐ జీవన్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

### 7 నుంచి రాకపోకల నిలిపివేత

జైనథ్, ఏప్రిల్ 5: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని తరోడ బ్రిడ్జిపై నుంచి ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు భారీ వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఆర్ అండ్‌బీ డీఈఈ సుభాష్‌బాయి ఒక ప్రకటనలో తెలిపారు. తరోడ బ్రిడ్జి వద్ద మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు నిమిత్తం నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ వెళ్లేవారు నిరాల నుంచి ఆడ, కంత, లాండసాంగ్వి మీదుగా వెళ్లాలని తెలిపారు. ఈ విషయాన్ని జైనథ్, బేల మండలాల ప్రజలు గమనించాలని కోరారు.

### వేదం పాఠశాలలో పాదపూజ

భైంసా, ఏప్రిల్ 5 : నిర్మల్ జిల్లా భైంసాలోని వేదం తపోవన్ పాఠశాలలో శనివారం తల్లిదండ్రులకు పాద పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామరావు పటేల్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికంగా చదువుకుంటూ ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులకు సైతం మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వేదం తపోవన్ పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

### డీఎస్సీ-2003 ఉద్యోగులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలి

ఎదులాపురం, ఏప్రిల్ 5 : కేంద్ర ప్రభుత్వం డీఎస్సీ–2003 ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలని సీపీఎస్‌టీఈఏటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1 సెప్టెంబర్ 2004 తర్వాత సీపీఎస్ విధానం అమల్లోకి వచ్చిందన్నారు. తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయులగా నియమించబడ్డ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు ,ఇతర శాఖ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు 57/4, 57/5 2023 ప్రకారం పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మోహన్‌నాయక్, సొయం కమలాకర్ పాల్గొన్నారు.

### సామ్రాట్ అశోక చక్రవర్తి జయంతి

ఎదులాపురం, ఏప్రిల్ 5: సామ్రాట్ అశోక చక్రవర్తి జయంతి వేడుకలు భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో శనివారం ఆదిలాబాద్‌లోని కైలాస్‌నగర్‌లోని అశోక బుద్ధ విహార్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా గౌతమ్ బుద్ధుడు, అశోక చక్రవర్తి, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞా కుమార్, జిల్లా అధ్యక్షుడు వితలే బుట్టే, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి సోగల సుదర్శన్, బుద్ధిస్ట్ మైత్రి మండలి అధ్యక్షుడు సత్యవాన్, సమతా సైనిక దళ్ నాయకుడు రమాకాంత్ కాంబ్లీ, రమాబాయి అంబేద్కర్ మహిళా సంఘం అధ్యక్షుడు దైవశాల హుక్కే, ఎస్‌సీఆర్‌పీఎస్ మహిళా నాయకులు ఉజ్వల పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 5: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని అంబేద్కర్ భవనంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలోచక్రవర్తి సామ్రాట్ అశోక్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధానకార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మారే, కమిటీ సభ్యులు మస్కే రాజ్‌వర్ధన్, దీలిప్‌మోరే, సత్యానంద్, దత్తా పరత్వాగ్, లక్ష్మణ్, కచ్రు, గౌతమ్, ప్రేమ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు కరంజివాసులు కృతజ్ఞతలు



హైమాస్ట్ వెలుగులో గ్రామస్తులు

తాంసి(భీంపూర్), ఏప్రిల్ 5: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం కరంజి(టీ) గ్రామంలోని రామాలయంలో ఉత్సవాల నేపథ్యంలో శనివారం రాత్రి హైమాస్ట్ లైట్లు ప్రారంభించారు. హైమాస్ట్ లైట్లు ఇచ్చిన బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, ఎం కల్పాప్ యాదవ్, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సతీశ్ యాదవ్, ఆశన్న, అశోక్, వామన్ పాల్గొన్నారు.

## అక్షర పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 5: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ అక్షర ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం స్థానిక కేఎన్ఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, పాఠశాల డైరెక్టర్లు కొంద్ర నరేశ్‌రెడ్డి, రాజారెడ్డి, పోశకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జొన్నలు వెంటనే కొనుగోలు చేయాలి

నేరడిగొండ, ఏప్రిల్ 5 : రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన జొన్నలు వెంటనే కొగొనుగోలు చేయాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశాడు. శనివారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రతి ఏడాదికి జొన్న పంట సాగు పెరుగుతున్నదని, గత సంవత్సరం సాగు విస్తీర్ణం71,300 ఎకరాలు ఉండగా ఈ ఏడాది 79 వేల ఎకరాలో పంట పండించినట్లు వ్యవసాయ శాఖ రిపోర్టు ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి ఎకరాకు 15–20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అన్నారు. దాదాపుగా 70 శాతం కోతలు పూర్తయిన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. పంట నిలువలు ఇళ్లలో సరిపోక ఖాళీ ప్రదేశాల్లో నిలువ ఉంచుతున్నారు. వర్షాలతో తడిసి నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్దతు ధరకంటే తక్కువకు ప్రైవేటు వ్యాపారుల వద్ద అమ్ముకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని లేదంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు నాగోరావ్, విఠల్, రవీందర్, భీంరావ్, నర్సయ్య పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీర కుటుంబానికి సాయం

కుంటాల, ఏప్రిల్ 5 : నిర్మల్ జిల్లా కుంటాలకు చెందిన చేపూరి వినయ్ బాబు ఇటీవల వెలువడిన గ్రూప్–4 ఫలితాల్లో ప్రభుత్వం ఉద్యోగం సాధించాడు. తల్లి లక్ష్మీవిశారద ప్రభుత్వ ఉద్యోగి, తండ్రి చంద్రప్రకాశ్ వ్యాపారిగా స్థిర పడ్డారు. తెలంగాణ ఉద్యమ పోరాట సమయంలో ప్రాణ త్యాగం చేసిన నిర్మల్ మండలం కొండాపూర్‌కు చెందిన భాస్కరా చారి కుటుంబానికి తన మొదటి జీతం నుంచి రూ. 10 వేలు శనివారం అందజేశాడు. భాస్కరాచారి 2009 డిసెంబర్ 3వ తేదీన భైంసాలోని గడ్డెన్నవాగులో దూకి స్వరాష్ట్ర కోసం ప్రాణాలు అర్పించాడు. ఇదే సమయంలో ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతుందని, పోటీ పరీక్షల కోసం తెలంగాణ చరిత్ర చదివేటప్పుడు చలించిపోయానని వినయ్ పేర్కొన్నాడు. అదే స్ఫూర్తితో ఆ కుటుంబానికి నా వంతు సాయం అందించాలని తెలిపారు. వినయ్ బాబు ప్రస్తుతం నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

నార్నూర్, ఏప్రిల్ 5 : తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జవహర్‌లాల్ ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని జామడ గ్రామ పంచాయతీ పరిధిలోని పూసిగూడ గ్రామాన్ని శనివారం సందర్శించారు. చేతిపంపు, తాగునీటి బావిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇబ్బంది పడకుండా నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో మిషన్ భగీరథ నిత్యం సరఫరా చేసేలా చూడాలని సూచించారు. ఆయన వెంట మిషన్ భగీరథ ఏఈఈ రాజు, పర్యవేక్షణ అధికారి రాథోడ్ గంగసింగ్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

### దేశీదారుపై ఉక్కు పాదం

జైనథ్, ఏప్రిల్ 5 : ఆదిలాబాద్ జైనథ్ మండలం బెలగాం గ్రామంలో మెస్రం పొచ్చిరాం తన పాన్‌షాపులో నిషేధిత దేశీదారు అమ్ముతున్నాడని విశ్వాసనీయ సమాచారం మేరకు ఎస్ఐ పురుషోత్తం ఏఎస్ఐ సిరాజ్ ఖాన్, పోలీసు సిబ్బంది దాడి చేశారు. తన షాపేలో నిషేధిత దేశీదారు 90 ఎంఎల్ బాటిళ్లు, 28 మొత్తం 2.58లీటర్లు, వీటి విలువ రూ.1008 దేశీదారు అమ్మగా వచ్చిన రూ.2400 స్వాధీనపర్చుకొని కేసు నమోదు చేశారని సీఐ సాయినాథ్ తెలిపారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

నేరడిగొండ, ఏప్రిల్ 5 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని కుప్టి బస్‌స్టాప్ వద్ద శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని దిలీప్(20 ) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..కుప్టి ఘాట్ శివారులో దేవ్‌నారాయణ్ దాబాలో దిలీప్ పని చేస్తున్నాడు. దాబా యజమాని శవంతారామ్ రాజస్థాన్‌లోని తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. దిలీప్ తన యజమానిని తెల్లవారుజామున కుప్టి బస్‌స్టాప్ వద్ద బస్సు ఎక్కించి తిరుగు ప్రయాణంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దిలీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడు రాజస్థాన్‌కు చెందిన వాడు కాగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపాడు.

### ఒకరికి గాయాలు

నర్సాపూర్ (జీ), ఏప్రిల్ 5 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలంలోని తురాటి గ్రామ ఎక్స్ రోడ్డు సమీపంలో బైకు – కారు ఢీ కొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాక్‌పల్లి గ్రామానికి చెందిన బ్యాగరి చిన్న భోజన్న వాహనంపై శనివారం వ్యవసాయ క్షేత్రానికి వెళ్తున్నాడు. భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కారు వెనుక నుండి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భోజన్నకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

లక్ష్మణచాంద, ఏప్రిల్ 5: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం వడ్యాల్ సమీపంలోని సరస్వతి కాలువలో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, ఎవరికైనా వివరాలు తెలిస్తే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

### పేకాటాడుతున్న నలుగురు అరెస్ట్

ఎదులాపురం, ఏప్రిల్ 5 : ఆదిలాబాద్‌లోని వరలక్ష్మి నగర్ శ్మశాన వాటిక వద్ద తాటిగూడకు చెందిన నలుగురు పేకాటాడుతూ పోలీసులకుపట్టుపడ్డారు. వారి వద్ద నుంచి రూ.1910, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని టూ టౌన్ సీఐ సీహెచ్ కర్ణాకర్ రావ్ తెలిపారు.



ఎదులాపురం: బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ



ఉట్నూర్: నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

## బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి



నిర్మల్‌అర్బన్: నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

ఎదులాపురం/జైనథ్/బేల/బోథ్/ఇచ్చోడ/నేరడిగొండ/తాంసి/తలమడుగు/ఉట్నూర్/ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి/నార్నూర్/నిర్మల్‌అర్బన్/సారంగాపూర్/లక్ష్మణచాంద/నర్సాపూర్(జీ)/ముథోల్/బాసర/కుభీర్/ఖానాపూర్, ఏప్రిల్ 5: స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల్లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జుపటేల్, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు



గుడిహత్నూర్: మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

గుడిహత్నూర్, ఏప్రిల్ 5 : దాబాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లోని పోలీస్ స్టేషన్‌లో శనివారం జాతీయ రహదారి, అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న దాబా నిర్వాహకులు, ఓనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాబాల్లో మద్యం, గంజాయి సేవించడం, అమ్మడం నిషేధమన్నారు. ఉల్లంఘించిన ఓనర్లు, నిర్వాహకులపై కేసులు తప్పవన్నారు. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దాబాల్లో పని చేసే ప్రతి వ్యక్తి వివరాలు వేలి ముద్రలతో పాటు పూర్తి సమాచారం పోలీస్ స్టేషన్‌లో ఉండాలని చెప్పారు. సమావేశంలో ఏఎస్పీ కాజల్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

### నిందితులకు శిక్షలు విధించబడినప్పుడు సమాజం మంచికై మార్పు సంభవిస్తుంది

ఎదులాపురం, ఏప్రిల్ 5 : నిందితులకు కోర్టులు శిక్షలు విధించబడినప్పుడు సమాజం మంచికై మార్పు సంభవిస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని పోలీసు హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో జిల్లా వ్యాప్తంగా గల కోర్టు డ్యూటీ అధికారులు, లైసెన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ నమోదైనా సందర్భం నుంచి కేసు పూర్తయ్యే వరకు ప్రతి అంశాన్ని కోర్టు డ్యూటీ అధికారులు పరిశీలించాలన్నారు. అదేవిధంగా దీర్ఘకాలికంగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న నేరస్తుల సమస్యను అన్నింటిని తీసుకొని వారికి అందజేయాలని తెలిపారు. ఎవరైనా నేరస్తులు కావాలని కోర్టుకు గైర్హాజరైతే వారిపై బేలబుల్ వారెంట్లను మంజూరు చేసే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న అన్ని ఎంబీడబ్ల్యూ వారెంట్లను తీసుకొని వాటిని ఎగ్జిక్యూట్ చేయాలని తెలిపారు. ప్రతి ఒక గ్రీవ్ కేసులో సమర్పించే షూరిటీలను పరిశీలించాలని, వారికి ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఎలాంటి ఫేక్ షూరిటీలను సమర్పించకుండా చూడాలన్నారు. కోర్టులో ఉన్న ప్రతి కేసులో నిందితులకు శిక్షలు పడినప్పుడు సమాజం మంచి వైపు మార్పు సంభవిస్తుందని తెలిపారు. దానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. ప్రతి కోర్టు డ్యూటీ అధికారి క్యాలెండర్ డైరీని ఏర్పాటు చేసుకొని అందులో వివరాలు పొందుపరచుకోవాలని సూచించారు. ఎలాంటి ఫైల్ అయినా పోలీస్ స్టేషన్ నుంచి స్వీకరించినప్పుడు సంబంధిత పోలీసు అధికారి ద్వారా ధ్రువీకరణ పత్రాన్ని ఇరువైపులా తీసుకునే విధంగా చూసుకోవాలన్నారు. న్యాయవాదులతో వ్యక్తిగతంగా ఎలాంటి సంబంధాలు ఉండకుండా చూసుకోవాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కోర్టు డ్యూటీ అధికారులకు సరైన నగదు బహుమతి ప్రశంసా పత్రాలు అందజేసి ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. కోర్టులో సాక్షుల వాంగ్మూలం నమోదు సందర్భంలో సరైన విధంగా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ సీహెచ్ నాగేందర్, సీఐ పండేరావ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డీ వెంకటి, ఎస్ఐ బాకీ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు గోపి, విజయ్, కోర్టు లైసెన్ అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాధర్నాను జయప్రదం చేయండి

ఎదులాపురం, ఏప్రిల్ 5 : ఛత్తీస్‌గఢ్ ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ప్రజాధర్నాలో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీ వెంకటనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఆదిలాబాద్‌లోని కుమ్రం భవన్‌లో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయంలో చలో హైదరాబాద్‌కు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు గౌరాల సుభాష్, మారుతి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఎస్ నర్సింగ్, సంజీవ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీశ్, పీవైఎల్ రాష్ట్ర నాయకుడు మారుతి పాల్గొన్నారు.

ఖానాపూర్, ఏప్రిల్ 5 : హైదరాబాద్ ఇందిరాపార్కులో ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న ప్రజా ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ కోరారు. శనివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో లింగన్న, స్వామి, గంగన్న, రాములు పాల్గొన్నారు.

## ‘ఒమన్’లో ఉగాది వేడుకలు



ఉగాది వేడుకల్లో పాల్గొన్న తెలుగు ప్రజలు

ఖానాపూర్, ఏప్రిల్ 5 : ఒమన్‌లో తెలంగాణ సమితి ఆధ్వర్యంలో శనివారం శ్రీ విశ్వావసు ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు కోర్ అండ్ జాయింట్ కమిటీ కన్వీనర్ గుండేటి గణేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ‘నమస్తే తెలంగాణ’తో ఫోన్‌లో మాట్లాడారు. 100కు పైగా తెలంగాణ కుటుంబాలు ఈ వేడుకల్లో పాల్గొన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నూనె లక్ష్మణ్, శ్రీనివాస్, రమేశ్, అమరేందర్, రవి, రాజేందర్‌రెడ్డి, రాధ, రాధిక పాల్గొన్నారు.

### వానరానికి అంత్యక్రియలు

బాసర, ఏప్రిల్ 5 : బాసర రైల్వేస్టేషన్ వద్ద శనివారం వానరం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. గమనించిన స్థానికులు స్టేషన్ మేనేజర్, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు స్పందించి వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు.